నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
బుధవారం
28 ఆగస్టు 2024
పేజీలు: 02




# ఐసీసీ చైర్మన్‌గా జై షా

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నూతన చైర్మన్‌గా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెక్రటరీ జై షా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ మేరకు మంగళవారం ఐసీసీ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రస్తుతం ఐసీసీ చైర్మన్‌గా ఉన్న గ్రెగ్ బార్క్‌లే పదవీకాలం త్వరలో ముగియనుండటంతో ఆయన స్థానాన్ని షా భర్తీ చేయనున్నాడు.తద్వారా 35 ఏండ్ల వయసులోనే ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికైన అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. డిసెంబర్ 1 నుంచి జై షా ఐసీసీ చైర్మన్ బాధ్యతలు స్వీకరించనున్నాడు. భారత్ నుంచి ఈ ఘనత దక్కించుకున్న ఐదో వ్యక్తి షా. గతంలో జగ్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్. శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఐసీసీ చైర్మన్లుగా పనిచేశారు. ఐసీసీ చైర్మన్‌గా ఎన్నికవడం తనకు దక్కిన గొప్ప గౌరవమని షా తెలిపాడు. ఐసీసీలో 17 ఓట్లు (12 టెస్టు ఆడే సభ్య దేశాలు, చైర్మన్, డిప్యూటీ చైర్మన్, ఇద్దరు అసోసియేట్ మెంబర్ నామినీలు, ఒక మహిళా డైరెక్టర్) ఉండగా జై షా ఎన్నికకు 15 మంది మద్దతు తెలపడంతో అతడి ఎన్నిక ఏకగ్రీవమైంది. ఐసీసీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన జై షా కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు శుభాకాంక్షలు తెలిపారు.

ముందున్న సవాళ్లు!

ఈ ఏడాది చివర్లో ఐసీసీ పగ్గాలు చేపట్టనున్న జై షా ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. వచ్చే ఏడాది పాకిస్తాన్ వేదికగా జరగనున్న చాంపియన్స్ ట్రోఫీలో భారత్ పాల్గొనడంపై సందేహాలు రేకెత్తుతుండగా... ఈ అంశంలో జై షా ఎలాంటి వైఖరి అవలంభిస్తారనేది కీలకంగా మారింది. జై షా ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడిగా పాకిస్తాన్‌లో జరగాల్సిన ఆసియా కప్‌ను హైబ్రిడ్ పద్ధతిలో పాకిస్తాన్, శ్రీలంకలో నిర్వహించారు. టీమిండియా ఆడాల్సిన మ్యాచ్‌లను శ్రీలంకలో జరిగే విధంగా షెడ్యూల్‌లో మార్పులు చేశారు. మరి ఇప్పుడు ఐసీసీ చైర్మన్‌గా ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాలి. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్ భాగం కావడంతో దానికి తగినంత ప్రచారం నిర్వహించడం... రోజు రోజుకు ప్రభ తగ్గుతున్న టెస్టు క్రికెట్‌కు పూర్వ వైభవం తేవడం... టి20ల ప్రభావంతో ప్రాధాన్యత కోల్పోతున్న వన్డేలను మరింత రసవత్తరంగా మార్చడం ఇలా పలు సవాళ్లు జై షాకు స్వాగతం పలుకుతున్నాయి.

## టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇస్తా: ఐసీసీ చైర్మెన్ జే షా

క్రికెట్ పురోగతికి అడ్డుగా నిలిచిన అన్ని అవరోధాలను తొలగించనున్నట్లు ఆయన చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీన గ్రేగ్ బార్క్లే నుంచి ఐసీసీ చైర్మెన్ బాధ్యతలను జే షా స్వీకరించనున్నారు. రెండేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారు. టీ20 క్రికెట్ సహజంగా ఉత్సామభరితమైన ఫార్మాట్ అని, కానీ దానికి సమానంగా టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎందుకంటే క్రికెట్‌కు అదే మూలాధారమైందని షా తెలిపారు. బీసీసీఐ కార్యదర్శి షా.. దీనిపై మంగళవారం ఓ స్టేట్మెంట్ రిలీజ్ చేశారు. లాంగెస్ట్ ఫార్మాట్ క్రికెట్ ఆడేదిశగా క్రికెటర్లను మళ్లించాలని, ఆ దిశగా తమ ప్రయత్నాలు ఉంటాయన్నారు. ట్యాలెంట్ ప్లేయర్ల కోసం ప్రత్యేక ప్రోగ్రామ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఆట ప్రమాణాన్ని పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేయనున్నట్లు షా హామీ ఇచ్చారు. చాలా కీలకమైన బాధ్యతను అప్పగించారని, మీ ఆశయాలకు తగినట్లు, అందమైన క్రికెట్ ఆటకు అంకిత అవుతానని షా తెలిపారు. అక్టోబర్‌లో జరిగే బీసీసీఐ బోర్డు మీటింగ్‌లో ఆయన తన కార్యదర్శి పోస్టును వదులుకునే అవకాశాలు ఉన్నాయి. ఐసీసీ చైర్మెన్‌గా ఎన్నికైన అయిదు భారతీయుడిగా నిలిచాడ తను. గతంలో జగన్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్ శ్రీనివాస్, శశాంక్ మనోహర్.. ఆ హై ప్రొఫైల్ జాబ్ చేశారు.





# సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి శంకుస్థాపన

ఈరోజు తప్పితే దసరా వరకు మంచి రోజులు లేవని, పండితులు తెలిపారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసుకోవడం మంచి పరిణామం అన్నారు. పది సంవత్సరాల నుంచి నిర్లక్ష్యానికి తెలంగాణ తల్లి విగ్రహం గురైందన్నారు. ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని భావించామన్నారు. వేద పండితుల సలహా మేరకు ఈరోజు ప్రారంభించామన్నారు. ఈరోజు తప్పితే దసరా వరకు మంచి రోజులు లేవని పండితులు తెలిపారు. సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కనిదంటూ ఏది లేదని.. తెలంగాణ ఉద్యమకారులు నిరూపించారన్నారు. సోనియాగాంధీ మాట శిలా శాసనం అని తెలిపారు. 2014 ,24 వరకు ఎన్నోన్నో నిర్మించామని చెప్పారన్నారు. పది సంవత్సరాలు పరిపాలన చేసిన వారు తెలంగాణ తల్లిని మరుగున పడేశారన్నారు. అన్నీ నేనే అని చెప్పారన్నారు. ప్రగతి భవన్ పేరుతో గడిని నిర్మించుకుని.. పోలీసులను పహారగా పెట్టారన్నారు. తెలంగాణ ప్రజలను ప్రగతి భవన్ లోకి రాకుండా దూరం పెట్టారని తెలిపారు. ప్రభుత్వ పాలనకు గుండెకాయ సచివాలయం అన్నారు. నాటి మంత్రులు ప్రజలకు అందుబాటులో లేరన్నారు. ఇరవై రెండున్నర లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు కానీ తెలంగాణ తల్లి విగ్రహం కోసం మహా అయితే కోటి రూపాయలు ఖర్చు అవుతుంది. దానికి మనుసు రాలేదు నాటి ప్రభుత్వానికన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం లేక పోవడం లోటుగా భావించమన్నారు. మేధావుల సూచనల మేరకు రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టామని తెలిపారు. కొందరు తమ కోసం సెక్రటేరియట్ ముందు స్థలం ఏర్పాటు పెట్టుకున్నారన్నారు. జూన్ 2న చెప్పిన.. సెక్రటేరియట్ లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పామని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఎమ్ కోరుకుంటూ నారో జేఎన్టియు ఫైన్ ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్ కు తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించే భాద్యత ఇచ్చామన్నారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరిస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలైన రోజు డిసెంబర్ 9, సోనియాగాంధీ జన్మదినోత్సవమని.. డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు పండుగ రోజన్నారు. పెద్ద ఎత్తున కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని, ఈ అవకాశం నాకు రావడం నా అదృష్టం అన్నారు.

డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరిస్తాం - సీఎం రేవంత్

డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరిస్తామని ప్రకటించారు సీఎం రేవంత్. హైదరాబాద్ సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకోబోతున్నామని ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు డిసెంబర్ 9 ఒక పండుగ రోజు అని తెలిపారు. వేలాది మందితో పెద్ద ఎత్తున విగ్రహావిష్కరణ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇది అరుదైన అవకాశం... ఈ కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నా అన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్ గాంధీ విగ్రహం లేకపోవడం ఒక లోటుగా కనిపించిందని... మేధావుల సూచన మేరకే సచివాలయం ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీన్ని వివాదం చేసేందుకే తెలంగాణ తల్లి విగ్రహంతో ముడి పెట్టారని ఆగ్రహించారు. పదేళ్లు అధికారంలో ఉండి వాళ్లు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయలేదని ఫైర్ అయ్యారు.



# గుజరాత్‌ను భారీ వర్షాలు

## 20 మంది మృతి, 23 వేల మంది సురక్షితం..

గుజరాత్ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో వరద పోటెత్తుతుంది. ఇప్పటికే పలు నగరాల్లో రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలతో దాదాపు 20 మంది ప్రాణాలను విడిచారు. అలాగే, మరో 23,000 మందిని సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. సుమారు 300 మంది సహాయక బృందాలు ఈ రెస్క్యూ ఆపరేషన్ లో పాల్గొన్నాయి. ఇక. గాంధీనగర్‌లో 2, ఆనంద్‌లో 6, మోర్బీలో 1, వడోదరలో 1, ఖేదాలో 1, మహిసాగర్‌లో ఇద్దరు మరణించారు. అలాగే, భరూచ్‌లో మరోకరు మరణించగా, అహ్మదాబాద్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటి వరకు 23,870 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా.. మరో 1,696 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. అయితే, మంగళవారం వర్షం తీవ్రత తగ్గుముఖం పట్టినప్పటికీ.. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణశాఖ గుజరాత్‌కు హెచ్చరికలు జారీ చేసింది. అలాగే, రెస్క్యూ, రిలీఫ్ ఆపరేషన్లను వేగవంతం చేయడానికి , గుజరాత్ సర్కార్ ఆరు ఇండియన్ ఆర్మీ బృందాల సహాయం కోరింది. దేవభూమి ద్వారక, ఆనంద్, వడోదర, ఖేడ, మోర్బి, రాజ్‌కోట్ జిల్లాల్లో ఇండియన్ ఆర్మీ, 14 ఎన్‌డీఆర్ఎఫ్, 22 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక కార్యక్రమాల్లో భాగమయ్యాయి. వర్షాల ధాటికి సురేందర్‌నగర్ జిల్లాలో ఓ బ్రిడ్జి కొలాప్స్ అయింది. ఇక, భారీ వర్షాలు, సహాయక చర్యలను సమీక్షించేందకు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న నదులు, సరస్సుల్లోకి ఎవరూ వెళ్లకుండా పోలీసుల సహకారం తీసుకుని పూర్తి అప్రమత్తతతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.



# అసలు హైడ్రా అంటే ఏంటి?

హైదరాబాద్‌లో చెరువులను ఆక్రమించిన వారి గుండెల్లో హైడ్రా దడ పుట్టిస్తోంది. హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీని రాష్ట్ర ప్రభుత్వం జులై 19న ఏర్పాటు చేసింది. హైదరాబాద్ పరిధిలోని చెరువుల సంరక్షణ, విపత్తుల నిర్వహణ, క్రీడా మైదానాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ వంటివి హైడ్రా బాధ్యతలు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలను ప్రస్తుతం హైడ్రా కూల్చేస్తోంది.



# జన్‌ధన్ అకౌంట్లలో రూ.2.31 లక్షల కోట్లు

ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనను ప్రారంభించి నేటికి పదేళ్లయ్యింది. 2015 మార్చికి 14.71కోట్ల ఖాతాల్లో ₹15,670cr డిపాజిట్లు ఉండగా, ఈ ఏడాది AUG 16కు 53.14కోట్ల అకౌంట్లలో ₹2.31L cr మొత్తం ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మరో 3 కోట్ల ఖాతాలు తెరిచే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల తెలిపారు. ఈ అకౌంట్లు ఓపెన్ చేసేందుకు, నిర్వహణకు ఛార్జీలుండవు. ₹2లక్షల ప్రమాద బీమాతో ఉచిత రూపే డెబిట్ కార్డు కూడా ఇస్తారు.




# ఓటీటీలో అదరగొడుతున్న కల్కి, మహారాజ

ప్రభాస్, అమితాబ్ బచ్చన్ కీలక పాత్రల్లో నటించిన కల్కి 2898AD చిత్రం గ్లోబల్ స్థాయిలో ఓటీటీలోనూ అదరగొడుతోంది. నాన్ ఇంగ్లిష్ మూవీస్ జాబితాలో హిందీ వెర్షన్ వరల్డ్ వైడ్ రెండో స్థానంలో ట్రెండ్ అవుతోంది. ఏకంగా 45 లక్షల వ్యూస్ సొంతం చేసుకుంది. 14 దేశాల్లో టాప్-10లో కొనసాగుతోంది. విజయ్ సేతుపతి నటించిన మహారాజ మూవీ ఎనిమిదో స్థానంలో ట్రెండ్ అవుతుండగా, 9 దేశాల్లో టాప్-10లో ఉంది.



# ఆ వార్త తెలియగానే షాకయ్యా

కోల్‌కతా వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటన తననెంతో బాధ పెట్టిందని నటి మాళవిక మోహనన్ విచారం వ్యక్తం చేశారు. మహిళల భద్రత గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మూలాలను కనుగొని వాటికి అడ్డుకట్ట వేయాలన్నారు. "ఇటీవల మహిళలపై జరుగుతోన్న అఘాయిత్యాలు చూస్తుంటే నా హృదయం ముక్కలవుతోంది. నేను ఓ ప్రమోషన్‌లో పాల్గొని మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న సమయంలో ఈ వార్త తెలిసింది. షాక్‌కు గురయ్యాను. ఇలాంటి ఘటనలు మహిళలను నిస్సహాయుల్ని చేస్తాయి. ఎలా.. ఎక్కడ ఎటు నుంచి ఆపద వస్తుందో తెలియడం లేదు. చాలా మంది స్త్రీలు ఇలాంటి ఘోరాల గురించి బయటకు చెప్పడానికి కూడా ఆలోచిస్తుంటారు. వారిపై జరిగిన దాడిని రహస్యంగా ఉంచుతున్నారు. చర్చించాలనుకుంటే ఇలాంటివి ఎన్నో ఉన్నాయి" అని చెప్పారు.



# నష్టాల్లో స్టాక్ మార్కెట్

దేశీయ మార్కెట్లు బుధవారం నష్టాల్లో కొనసాగుతున్నాయి. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో.. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుతున్నాయి. దీంతో దేశీయంగా మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. ఫలితంగా నేటి ఆరంభం నుంచే సూచీలు ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. బుధవారం నాటి ట్రేడింగ్‌ను లాభాలతోనే మొదలుపెట్టిన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ప్రస్తుతం ఉదయం 9.40 గంటల సమయంలో సెన్సెక్స్ 62 పాయింట్ల నష్టంతో 81,649, నిఫ్టీ 33 పాయింట్ల నష్టంతో 24,984 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు క్షీణించి 83.95 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీలో ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ఉండగా.. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, హీరో మోటార్స్, టాటా స్టీల్, ఓఎన్జీసీ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి.

# శ్రీకాకుళంలో భూప్రకంపనలు!

శ్రీకాకుళంలో భూప్రకంపనలు అలజడి రేపాయి. ఇచ్ఛాపురం పరిసరాల్లో తెల్లవారుజామున 3.40 గంటలకు ఒకసారి, 4.03 గంటలకు మరోసారి భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. 3 సెకన్ల పాటు భూమి కంపించినట్లు సమాచారం. దీంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇవాళ హైదరాబాద్‌కు

# ఎమ్మెల్సీ కవిత

## సాయంత్రం 4:45 గంటలకు శంషాబాద్




ఢిల్లీ మద్యం కేసులో ఐదు నెలల క్రితం అరెస్టయ్యి మంగళవారం బెయిల్‌పై విడుదలైన కవిత ఇవాళ హైదరాబాద్‌కు రానున్నారు. మధ్యాహ్నం 2:45 గంటలకు ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయలుదేరనున్నారు.సాయంత్రం 4:45 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి నేరుగా ఆమె తన నివాసానికి వెళ్లనున్నారు. అయితే తమ అభిమాన నాయకురాలు దాదాపు ఐదు నెలల తర్వాత తెలంగాణకు వస్తుండడంతో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. ఆమెకు ఘనస్వాగతం పలికేందుకు భారత జాగృతి భారీ ఏర్పాట్లు చేసింది.కాగా ఢిల్లీ లిక్కర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కవితను ఈ ఏడాది మార్చి 15న ఈడీ అరెస్టు చేయగా, ఏప్రిల్ 15న సీబీఐ అరెస్టు చేసింది. అప్పట్నుంచి ఆమె తీహార్ జైలులోనే ఉంటున్నారు. ఈ ఐదు నెలల్లో అనేక పరిణామాల అనంతరం కేసు సుప్రీంకోర్టుకు చేరింది. కవిత బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ బెయిల్ ఇచ్చింది. కవిత భర్త అనిల్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర.. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో పూచీకత్తు సమర్పించారు. దాంతో ఆమె విడుదలను అంగీకరిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీహార్ జైలుకు వారెంట్ ఇచ్చింది. ట్రయల్ కోర్టు రిలీజ్ వారెంట్ ఇవ్వడంతో 164 రోజులుగా జైలులో ఉన్న కవిత జైలు నుంచి బయటికి వచ్చారు. అయితే మంగళవారం రాత్రి 9 గంటలకు జైలు నుంచి బయటకు వచ్చిన ఎమ్మెల్సీ కవిత భావోద్వేగానికి లోనయ్యారు. ఐదు నెలలు తర్వాత బయటకు రావడంతో భర్త అనిల్ కుమార్, సోదరుడు కేటీఆర్, కుమారుడిని చూసి కన్నీరు పెట్టుకున్నారు. ఆమె విడుదల సందర్భంగా జైలు వద్దకు మాజీ మంత్రి హరీశ్ రావు, బీఆర్ఎస్ ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున చేరుకున్నారు.



## నిండుకుండలా శ్రీశైలం జలాశయం..

# 10 గేట్లు ఎత్తివేత

శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద ఉధృతి కొనసాగుతోంది. గత నాలుగు రోజులుగా కృష్ణానదికి క్రమంగా ఇన్ ఫ్లో కొనసాగుతోంది. గత రెండ్రోజులుగా కృష్ణా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాలకు భారీగా వరద నీరు పొటెత్తుతోంది. దీంతో 24 గేట్లను ఎత్తిన అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతుండటంతో రిజర్వాయర్ నిండుకుండలా మారింది. పరిస్థితిని గమనించిన నీటి పారుదల శాఖ అధికారులు 10 రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది రిజర్వాయర్ గేట్లను ఎత్తడం ఇది రెండోసారి. ప్రస్తుతం శ్రీశైలం ఇన్ ఫ్లో 2,13,624 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 1,22,876 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 880 అడుగులకు నీటి ప్రవాహం చేరుకున్నట్లు సమాచారం. కాగా, కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.




# ఓయోలో సీసీ కెమెరాలు.. జాగ్రత్త

శంషాబాద్‌లో సిటా గ్రాండ్ ఓయో హోటల్ గదిలో సీక్రెట్ సీసీ కెమెరా ఏర్పాటు చేసిన హోటల్ నిర్వాహకుడు ఒంగోలు వాసి గణేష్. బెడ్ రూంలోని బల్బ్‌లలో సీక్రెట్ కెమెరాలు పెట్టిన నిర్వాహకుడు. రూమ్ అద్దెకు తీసుకున్న వ్యక్తుల అశ్లీల చిత్రాలను చిత్రీకరించి, బాధితులను బెదిరిస్తున్న ఓయో హోటల్ నిర్వాకుడు. హోటల్ నిర్వాకుడు ఒంగోలు వాసి గణేష్‌గా గుర్తింపు. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఓ జంట.. తనిఖీలు చేసి నిందితుని అదుపులోకి తీసుకున్న పోలీసులు.




# మల్లా రెడ్డి సంస్థలకు హైడ్రా నోటీసులు

చిన్న దామెర చెరువు బఫర్ జోన్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి చెందిన దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కాలేజీలను నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) నోటీసులు అందజేసింది.15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాన్ని హైడ్రా కోరింది. కళాశాలల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కళాశాల యాజమాన్యాన్ని కోరింది. ఇప్పటికే కళాశాల ప్రాంగణాన్ని అధికారులు పరిశీలించారు.చిన్న దామెర చెరువు బఫర్‌జోన్‌లో గతంలో నిర్మించిన కొన్ని భవనాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు.రాజశేఖర్ రెడ్డి మాజీ మంత్రి మరియు బీఆర్ఎస్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లా రెడ్డి అల్లుడు, మల్లా రెడ్డి విశ్వవిద్యాలయం మరియు వైద్య కళాశాలతో సహా సంస్థలను నిర్వహిస్తున్నారు.

## సెప్టెంబర్ 2న

# డీఎస్సీ ఫైనల్ కీ?

డీఎస్సీ పరీక్షల ఫైనల్ కీని వచ్చే సెప్టెంబర్ 2న రిలీజ్ చేసేందుకు తెలంగాణ విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. అనంతరం జిల్లాల వారీగా ర్యాంకుల జాబితాను వెల్లడించనుంది. రిజర్వేషన్ల ప్రకారం 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను సర్టిఫికెట్ ల పరిశీలనకు పిలవనుంది. ఆ తర్వాత మెరిట్ ఉన్న వారికి జాయినింగ్ ఆర్డర్స్‌ను అధికారులు ఇవ్వనున్నారు. మొత్తం 11,062 పోస్టులకు జులై 18 నుంచి ఆగస్టు 5వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరిగాయి.




# ఎయిరిండియా కీలక నిర్ణయం

## ప్రాంతీయ భాషల్లోనూ కస్టమర్ కేర్ సేవలు

దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. తన కస్టమర్ కేర్ సర్వీసులను మరింత విస్తృతం చేసింది. ఇప్పటివరకు హిందీ, ఇంగ్లిష్ భాషలకే పరిమితమైన తన కస్టమర్ కేర్ సేవలను ఇక నుంచి ప్రాంతీయ భాషల్లోనూ అందించాలని నిర్ణయించింది. ఆ మేరకు తెలుగుతో పాటు ఏడు ప్రాంతీయ భాషల్లోకి కస్టమర్ కేర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది.తెలుగుతోపాటు తమిళం, పంజాబీ, మరాఠీ, మలయాళం, కన్నడ, బెంగాలీలో ఎయిరిండియా కస్టమర్ కేర్ సేవలు అందుబాటులో ఉంటాయి. కస్టమర్ల మొబైల్ నెట్‌వర్క్ ఆధారంగా ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ ) సిస్టం వారి భాష ప్రాధాన్యతను ఆటోమేటిక్‌గా గుర్తిస్తుందని ఎయిరిండియా పేర్కొంది. 'భారతీయ భాషలలో బహుభాషా సపోర్టును తీసుకురావడం అనేది మా ప్రయాణంలో ఒక కీలకమైన మైలురాయి అని చెప్పాలి. ఈ ప్రాంతీయ భాషలను మా కస్టమర్ సపోర్ట్ సర్వీసుల్లో చేర్చడం ద్వారా మేము మా పరిధిని విస్తరించడమే కాకుండా మా కస్టమర్లతో సంబంధాన్ని కూడా బలోపేతం చేసుకున్నట్లయ్యింది. ఎయిరిండియాతో ప్రయాణికులందరినీ కలుపుకుపోయేలా చూస్తాం' అని ఎయిరిండియా చీఫ్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ రాజేష్ డోగ్రా తెలిపారు. ఇక ఇటీవల ఎయిరిండియా ఐదు కాంటాక్ట్ సెంటర్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటి ద్వారా తరచూ ప్రయాణించే వారికి, ప్రీమియం కస్టమర్లకు అన్ని వేళలా కస్టమర్ కేర్ సర్వీసులు అందిస్తామని ఎయిరిండియా తెలిపింది.

ఇటీవల విడుదలైన 'మిస్టర్ బచ్చన్' సినిమాలో తన అందచందాలతో యువ ప్రేక్షకుల్ని కట్టిపడేసింది మరాఠీ భామ భాగ్యశ్రీ బోర్సే. ఒక్క చిత్రంతోనే యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ప్రస్తుతం ఈ సొగసరికి తెలుగులో భారీ అవకాశాలొస్తున్నాయి. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించనుంది. దీంతో పాటు దుల్కర్ సల్మాన్ సినిమాలో కూడా ఈ భామ నాయికగా ఖరారైందని వార్తలు వినిపిస్తున్నాయి. తొలి చిత్రంలోనే తెలుగు ప్రేక్షకులు తనపై అభిమానాన్ని చూపించారని, ఓ ఫ్యామిలీ మెంబర్‌లా చూసుకున్నారని భాగ్యశ్రీ ఆనందం వ్యక్తం చేసింది. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ పోస్ట్ చేసింది. "మిస్టర్ బచ్చన్' చిత్రంలో జిక్కీ పాత్ర ఎంతగానో నచ్చిందని నాకు సందేశాలు పంపిస్తున్నారు. మీ ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. ఇండస్ట్రీలో నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. నా తదుపరి సినిమాల గురించి ఆసక్తికరమైన విషయాలను మీతో పంచుకోవాలని ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. ఆ విషయాలను త్వరలో వెల్లడిస్తా' అని పేర్కొంది.

# వెలకట్టలేని అభిమానం

